సాక్షి అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 16 । జూలై । 2023

న్యూస్‌రీల్

3,381 ధ్రువీకరణ పత్రాల పంపిణీ

సాక్షి, పాడేరు: జిల్లాలో శనివారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో 3,381 ధ్రువీకరణ పత్రాలు పంపిణీ చేసినట్టు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా 6 మండలాల పరిధిలో 10 సచివాలయాల్లో జగనన్న సురక్ష ప్రత్యేక శిబిరాలు నిర్వహించామని ఆయన తెలిపారు. 7,826 గృహాల నుంచి వలంటీర్ల యాప్‌లో వివిధ సర్టిఫికెట్ల కోసం 7,341 వినతులు రాగా, 9,493 టోకెన్లు జారీ చేశామని పేర్కొన్నారు. వీటిలో 3,381 సర్టిఫికెట్లు పంపిణీ చేశామని, 40 దరఖాస్తులు తిరస్కరణకు గురి కాగా మిగిలిన 3,594 సర్టిఫికెట్లు రానున్న రెండు, మూడురోజుల్లో వలంటీర్ల ద్వారా పంపిణీ చేయడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు.

ఘనంగా శాకంబరి ఉత్సవం



కూరగాయలు,ఆకుకూరలతో అలంకరించిన అలివేలుమంగ, పద్మావతి సహిత స్వామివారు

సాక్షి, పాడేరు: స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలివేలుమంగ, పద్మావతి సహిత వేంకటేశ్వరస్వామి విగ్రహాలను కూరగాయలు, ఆకుకూరల అలంకరణతో శాకంబరి ఉత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి దేవతామూర్తుల విగ్రహాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వాసవి, వాసవీ క్లబ్‌ల ప్రతినిధులతో పాటు సుండ్రుపుట్టు గ్రామపెద్దలు పాల్గొన్నారు. ఇదే ఆలయంలో సంతోషిమాత విగ్రహాన్ని కూరగాయలతో అలంకరించి శాకంబరి ఉత్సవం నిర్వహించారు.

కార్యదర్శులది కీలక బాధ్యత

● డీపీవో కొండలరావు

చింతూరు: వరదల సమయంలో విధుల నిర్వహణ విషయంలో పంచాయతీ కార్యదర్శులది కీలక బాధ్యతని జిల్లా పంచాయతీ అధికారి కొండలరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ పునరావాస కేంద్రాల నిర్వహణ, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. పారిశుధ్య నిర్వహణ, ప్రజారోగ్య పరిరక్షణ విషయంలో కార్యదర్శులు మంచిగా పనిచేయాలని ఆయన ఆదేశించారు. డీఎల్పీవో రాఘవన్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో పాటు ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుని విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరత్నం, నాలుగు మండలాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మాజీమంత్రి మత్స్యరాస బాలరాజుకు అస్వస్థత

జి.మాడుగుల: మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యరాస బాలరాజు శనివారం మధ్యాహ్నం ఇంటివద్ద అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను కుటుంబ సభ్యులు పాడేరు జిల్లా అస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం అంబులెన్స్‌లో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. బాలరాజుకు కడుపునొప్పి, ఇతర ఆరోగ్యపరమైన సమస్య లున్నట్టు పెద్ద కుమారుడు మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు తెలిపారు.

కష్టం..నష్టం లేకుండా..

ఎగువన కురుస్తున్న వర్షాలతో గోదావరి, శబరి నదుల్లో నీటిమట్టాలు క్రమేపీ పెరుగుతున్నాయి. ఈ ఏడాది ప్రస్తుతానికి వరద పరిస్థితులు లేకున్నా రానున్న రోజుల్లో భారీ వర్షాలు కురిసి వరదలు వస్తే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు ప్రత్యేక ప్రణాళికతో సమన్వయంతో సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కసరత్తు చేపట్టారు. ఆహార కొరత లేకుండా, అత్యవసర సేవలకు సమస్యలు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు.

- వరదొస్తే ఎదుర్కొనేందుకు ముందస్తు జాగ్రత్తలు
- పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- అప్రమత్తమైన అధికారులు
- ఆహారకొరత లేకుండా బఫర్ స్టాక్
- ముంపు మండలాల్లో ముందస్తు జాగ్రత్తలు



దేవీపట్నం: గండిపోశమ్మ ఆలయంలోకి వచ్చేసిన గోదావరి వరద నీరు

చింతూరు: జిల్లాలో వరదల్లో ముంపునకు గురయ్యే ప్రాంతాలపై అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. భద్రాచలం వద్ద 1,2,3 ప్రమాద హెచ్చరికలు నెలకొన్న పరిస్థితుల్లో ఎలాంటి ముందస్తు చర్యలు చేపట్టాలనే దానిపై ఇప్పటికే అధికారులు నివేదికలు సిద్ధం చేశారు.

సురక్షిత ప్రాంతాలకు తరలించేలా..

ఏయే గ్రామాలు ముంపుకు గురవుతాయి, ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలి, పునరావాస కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై ఇప్పటికే కసరత్తు చేపట్టారు.పునరావాస కేంద్రాల్లో ఎవరైనా అనారోగ్యం బారిన పడితే వారికి అందించే వైద్యసేవలు, విద్యుత్ సౌకర్యం, అంటువ్యాధులు ప్రబలకుండా పారిశుధ్యంపై తీసుకోవాల్సిన చర్యలపై కూడా అధికారులు చర్యలు చేపట్టారు. 36 చేతిబోర్లు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు.

రెండు వేల టన్నుల బియ్యం..

వరదలు సంభవించే ప్రాంతాలను గుర్తించిన అధికారులు నిత్యావసరాలు, తాగునీరు, వైద్యంపై ముందస్తుగా సిద్ధమయ్యారు. వరద తాకిడికి గురయ్యే నాలుగు మండలాల్లో స్టాకు పాయింట్లను గుర్తించిన అధికారులు జూలై, ఆగస్టు, సెప్టెంబరుకు సరిపడా రెండు వేల టన్నుల బియ్యం,20 టన్నుల కందిపప్పు నిల్వ చేశారు. దీనిలో భాగంగా ఇప్పటికే ఈ నెలకు సంబంధించిన రేషన్‌ను పంపిణీ చేశారు.

అత్యవసర సేవలు అందేలా..

తాగునీటి అవసరాలు తీర్చేందుకు నాలుగు మండలాలకు 19,200 వాటర్‌ప్యాకెట్లు, 15 జనరేటర్లు సిద్ధం చేశారు. వరదలు సంభవిస్తే ముందుగానే తరలించేందుకు నాలుగు మండలాల్లో 220 మంది గర్భిణులు, 45 మంది డయాలసిస్ రోగులను గుర్తించారు. అత్యవసరంగా కాన్పులు చేసేందుకు చింతూరు ఏరియా ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించారు. వరదల సమయంలో సేవలందించేందుకు కూనవరం మండలం కోతులగుట్ట సీహెచ్‌సీలో గైనకాలజిస్టును నియమించనున్నారు. పాముకాటు, తేలుకాటు, కుక్కకాటు వ్యాక్సిన్లను కూడా వరద ప్రాంతాల్లో సిద్ధం చేశారు. ఈసారి పాముకాటు వ్యాక్సిన్ ఏఎన్‌ఎంల వద్ద కూడా అందుబాటులో ఉంచామని వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తెలిపారు.

పునరావాస కేంద్రాల్లో బోర్లు



జెడ్పీటీసీ నిధులతో మండలానికి 15 బోర్లు మంజూరు అయ్యాయి. వీటిని చింతూరు మండలంలోని పునరావాస కేంద్రాల్లో ఏర్పాటు చేసేలా గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం అధికారులు చర్యలు చేపట్టాలి. చదలవాడ పంచాయతీ పరిధిలోని ఐదు గిరిజన గ్రామాలకు ప్రాధాన్యమివ్వాలి.

– చిచ్చడి మురళి, జెడ్పీటీసీ, చింతూరు మండలం

ప్రత్యామ్నాయ రహదారి నిర్మించాలి



వరదల సమయంలో రవాణా కోసం కూనవరం మండలం కోతులగుట్ట నుంచి చింతూరు మండలం ఏడుగురాళ్లపల్లి వరకు రహదారి నిర్మించాలి. దీనివల్ల కూనవరం మండలంలో 50 గ్రామాలతోపాటు భద్రాచలం వెళ్లేందుకు దగ్గరమార్గం ఏర్పడుతుంది. తాగునీరు, మందులు అందుబాటులో ఉంచాలి.

– గుజ్జా విజయ, జెడ్పీటీసీ, కూనవరం మండలం

అందుబాటులో లాంచీలు



మారుమూల గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు లాంచీలు అందుబాటులో ఉంచాలి. ఒకేసారి సుమారు 40 మందిని తరలించేలా మండలానికి రెండు చొప్పున లాంచీలను ఏర్పాటు చేయడం వల్ల చాలా ఉపయోగకరంగా ఉంటుంది. అంటువ్యాధులు ప్రబలకుండా కూడా చర్యలు చేపట్టాలి.

– మేడేపల్లి సుధాకర్, వైస్ ఎంపీపీ, చింతూరు

నిత్యావసరాల నిల్వలు సిద్ధం

జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్

అన్ని శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయడం ద్వారా వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనవచ్చని జాయింట్ కలెక్టర్ శివశ్రీనివాస్ సూచించారు. స్థానిక ఐటీడీఏలో శనివారం నిర్వహించిన వరద సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదలను ఎదుర్కొనేందుకు క్షేత్రస్థాయిలో ప్రణాళిక ప్రధానమని, ప్రజలకు మానవతా దృక్పథంతో సేవలు అందించాలని సూచించారు. ముంపు ప్రాంతాల్లో మూడు నెలలకు సరిపడా నిత్యావసరాలు నిల్వ ఉంచాలని, వరద పరిస్థితులుంటే లాంచీలు, పడవల ద్వారా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆయన ఆదేశించారు. వరదలతో భయాందోళనలున్న ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించడం ద్వారా మనోధైర్యాన్ని కలిగించాలని సూచించారు. ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ పీవో సూరజ్ ధనుంజయ్ గనోరే, ఏఎస్పీ రాహుల్ మీనా, డీఎఫ్‌వో పుష్పసౌజన్య, వివిధ శాఖల అధికారులు, నాలుగు మండలాల ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోదకొండమ్మతల్లికి కుంకుమార్చన

● అమ్మవారిని కుటుంబ సమేతంగా దర్శించుకున్న ఎస్పీ తుహిన్‌సిన్హా



మోదకొండమ్మతల్లిని దర్శించుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా కుటుంబ సభ్యులు

సాక్షి, పాడేరు: మోదకొండమ్మతల్లిని ఎస్పీ తుహిన్ సిన్హా కుటుంబసభ్యులతో శనివారం దర్శించుకున్నారు. సతీమణి, తల్లిదండ్రులతో కలిసి కుంకుమార్చన, పూజలు నిర్వహించారు. ఎస్పీ కుటుంబ సభ్యులను శాలువాతో సత్కరించి, అమ్మవారి ఫొటో, ప్రసాదాన్ని ఆలయ కమిటీ అందజేసింది.

నిత్యాన్నదానానికి భారీ గుమ్మడి కాయ



సింహాచల దేవస్థానానికి గిరిజనుడు దొన్ను సమర్పించిన భారీ గుమ్మడికాయ

సాక్షి, పాడేరు: ముంచంగిపుట్టు మండలం కుమ్మరిపుట్టు గ్రామానికి చెందిన దొన్ను అనే గిరిజనుడు సింహాచల దేవస్థానం నిత్యాన్నదాన కార్యక్రమానికి 13 కిలోల భారీ గుమ్మడికాయను పంపారు. దీనిని దేవస్థానం ధర్మప్రచారక్ సురేంద్రబాబు అన్నదాన విభాగానికి అందజేశారు. శనివారం తయారుచేసిన వంటకాల్లో ఈగుమ్మడిని వినియోగించారు.

ఔషధ మొక్కల సాగు లాభదాయకం



గిరిజన రైతులతో ఔషధ మొక్కలు నాటిస్తున్న శాస్త్రవేత్త నాగలక్ష్మి



గిరి రైతులకు ప్రకృతి ఎరువులు పంపిణీ చేస్తున్న శాస్త్రవేత్తలు

డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ శాస్త్రవేత్త నాగలక్ష్మి

గంగవరం : ఔషధ, సుగంధ మొక్కల సాగు ఎంతో లాభదాయకమని వెంకటరామన్నగూడెం డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వ విద్యాలయ శాస్త్రవేత్త డాక్టర్.టి.నాగలక్ష్మి సూచించారు. శనివారం అభిమన్య రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మెత్త గిరిజన గ్రామంలో నిర్వహించిన రైతుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అఖిల భారత ఔషధ సుగంధ మొక్కలు, తమలపాకు సమన్వయ పరిశోధన పథకంలో రైతులకు అశ్వగంధ మొక్కలు, ప్రకృతి ఎరువులను గిరి రైతులకు పంపిణీ చేశారు. అశ్వగంధ సాగు, ఔషధ మొక్కల పెంపకంపై శాస్త్రవేత్తలు డా.డి.అపర్ణ, డా.పి. సునీత, జాతీయ వ్యవసాయ సంస్థ డీడీపీ ప్రకాష్ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అభిమన్య రైతు ఉత్పత్తిదారుల సంస్థ చైర్మన్ సత్యనారాయణ, సునీల్, సతీష్, విజయ్ పాల్గొన్నారు.

పశుగ్రాస పెంపకంతో దాణా సమస్య దూరం



మాట్లాడుతున్న జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ వెంకటస్వామి

పాడేరు రూరల్ : పాడి రైతులు తమకున్న భూమిలో కొంత భాగాన్ని పశుగ్రాస పెంపకానికి కేటాయించడం ద్వారా దాణా సమస్యను అధిగమించవచ్చని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ జి. వెంకటస్వామి సూచించారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా శనివారం పాడేరులో పాడి రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశుగ్రాసం పెంపకం వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు. పశువులకు సరైన పశుగ్రాసం అందిస్తేనే అవి ఆరోగ్యంగా ఉంటాయన్నారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎల్. రాజారవికుమార్, పశువైద్యాధికారి రాజా కిశోర్, పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్లు వి.వి. రమణ, బాబూరావు, శ్రీనుబాబు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతుల ఐటీఐలో ప్రవేశాలు

ఏయూక్యాంపస్: విభిన్న ప్రతిభావంతుల కోసం బక్కన్నపాలెంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఐటీఐ కళాశాలలో పలు కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విభిన్న ప్రతిభావంతులు, వృద్ధుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జె.మాధవి తెలిపారు. కార్పెంటరీ, షీట్ మెటల్, వెల్డింగ్, పెయింటింగ్ కోర్సుల్లో 84 మంది బాలురకు ప్రవేశాలు కల్పించడంతోపాటు ఉచిత వసతి కల్పించడం జరుగుతుందన్నారు. ప్రస్తుతం రెండో దశ ప్రవేశాలు కల్పిస్తున్నామని, ఆసక్తి గల వారు ఈ నెల 31వ తేదీ లోగా పాఠశాల ప్రిన్సిపాల్ సిహెచ్ భాస్కర్‌ను 73964 24319 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా విభిన్న ప్రతిభావంతులకు ఇక్కడ ప్రవేశాలు కల్పిస్తామన్నారు.

గిరిజన సంక్షేమ శాఖ ఏఈగా శ్రీదివ్య



చింతపల్లి రూరల్: స్థానిక గిరిజన సంక్షేమశాఖ ఏఈగా శ్రీదివ్య శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ డీఈఈగా పనిచేస్తున్న చాణిక్యరావు ఇప్పటివరకు రెండు పోస్టుల్లో కొనసాగేవారు. ఏఈ పోస్టు భర్తీ చేయడంతో ఆమెకు పూర్తి స్థాయి బాధ్యతలను ఉన్నతాధికారులు అప్పగించారు.

అందరికీ వంద రోజుల పని

ఉపాధి హామీ పీడీ రమేష్‌రామన్



సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

కూనవరం: అందరికి వంద రోజులు పనిదినాలు కల్పించాలని, సరాసరి వేతనం రూ. 272 సమకూరేలా మేట్లకు శిక్షణ ఇవ్వాలని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ రమేష్ రామన్ ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో 2022-23కు సంబంధించి 15వ ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.6.2కోట్లతో 272 పనులు ఈ ఏడాది చేపట్టడం జరిగిందన్నారు. నాణ్యత లోపాలున్న పది పనులను మరమ్మతులు చేపట్టడమే కాకుండా, సిబ్బంది నుంచి రూ.8 వేల రికవరీకి ఆదేశించారు. ఈసమావేశంలో స్టేట్ రిసోర్సు పరసన్ కనకరాజు, ఏపీవో శ్రీకాంత్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

ముఠా బ్లాక్‌ల పరిరక్షణకు పటిష్ట చర్యలు

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ వీకే సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీఎఫ్ వీకే సింగ్

అడ్డతీగల: బ్రిటీష్ కాలం నుంచి ఉన్న ముఠా బ్లాక్‌ల పరిరక్షణకు పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నట్లు అటవీశాఖ పీసీసీఎఫ్ (ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) వీకే సింగ్ తెలిపారు. అడ్డతీగల అటవీ క్షేత్రాధికారి కార్యాలయం వద్ద రంపచోడవరం అటవీ డివిజన్‌లోని అటవీక్షేత్రాధికారులు, ఇతర సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అడవుల సంరక్షణ, పెంపుదలను బాధ్యతగా తీసుకుని ప్రతీ ఒక్కరూ పనిచేయాలని సూచించారు. ముఠా బ్లాక్‌ల పరిరక్షణకు సంబంధించి వాటి పరిధిలోని అటవీ భూముల వివరాలు, ఆక్రమణకు గురైతే వాటి వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నామని తెలిపారు. మారేడుమిల్లి, అడ్డతీగల, రంపచోడవరం, సూదికొండ అటవీ క్షేత్రాల పరిధిలో రికార్డుల ప్రకారం 126 ముఠా బ్లాక్‌లు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఇప్పటికే 40 బ్లాక్‌ల పరిశీలన క్షేత్రస్థాయిలో పూర్తయిందన్నారు. కొన్ని చోట్ల ఆయా బ్లాక్‌ల పరిధిలోని భూములు అన్యాక్రాంతం అయినట్లు గుర్తించామన్నారు. రెవెన్యూ అధికారులతో కలిసి ఆయా రేంజిల పరిధిలోని ముఠా బ్లాక్‌లను పరిశీలించి వాటిని యథావిధిగా ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందుకు రెవెన్యూ ఉన్నతాధికారుల సహకారం కోరామన్నారు. ఈ సమావేశంలో కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ శరవణన్, రంపచోడవరం డీఎఫ్‌వో నరేంద్రన్, స్క్వాడ్ డీఎఫ్‌వో త్రిమూర్తులురెడ్డి, సబ్ డీఎఫ్‌వో భరణి, స్క్వాడ్ రేంజ్ ఆఫీసర్ శ్రీరామారావు, అడ్డతీగల, సూదికొండ, రంపచోడవరం , గోకవరం అటవీక్షేత్రాధికారులు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు సద్వినియోగం

విశాఖ పోస్టుమాస్టర్ జనరల్ కల్నల్ రాములు



పోస్టల్ ఖాతా పాసు పుస్తకాన్ని అందజేస్తున్న రాములు

అరకులోయ టౌన్: ప్రతి ఒక్కరు పోస్టల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని విశాఖపట్నం పోస్టు మాస్టర్ జనరల్ కల్నల్ వి.రాములు అన్నారు. శనివారం మాడగడ, పెదలబుడు, మాదల బ్రాంచ్‌లను సందర్శించారు. పోస్టల్ సేవలపై ఆయా గ్రామాల్లో వినియోగదారులకు అవగాహన కల్పించారు. పోస్టల్ ఖాతాలను తెరిపించి వాటికి సంబంధించిన పాసు పుస్తకాలను అందజేశారు. అనకాపల్లి డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ ప్రసాద్ బాబు, అరకులోయ సబ్‌డివిజన్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, పోస్టమాస్టర్లు భాగ్యవతి, సుకారి, హరినాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రమదానంతో మట్టి రోడ్డు పనులు


రోడ్డు పనులు చేస్తున్న గిరిజనులు

జి.మాడుగుల: వంతాల పంచాయతీ కేంద్రం నుంచి కోట్లగరువు, అడ్డులుకొత్తవీధి గ్రామం వరకు ఆయా గ్రామాల గిరిజనులు 3 కిలోమీటర్లు మేర మట్టి రోడ్డును శ్రమదానంతో నిర్మించుకుంటున్నారు. రోడ్డు సదుపాయం కల్పించాలని అధికారులకు వినతులు ఇచ్చినా ప్రయోజనం లేకుండాపోయిందని గ్రామస్తులు చెబుతున్నారు. రోడ్డు లేకపోవటం వలన ఇబ్బందులు పడుతున్నామని, దీంతో విరాళాలు సేకరించి, శ్రమదానంతోనే మట్టి రోడ్డు పనులు చేపడుతున్నట్టు చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత రోడ్డు నిర్మిచాలని వారు కోరుతున్నారు.

22 కిలోల గంజాయితో ఇద్దరు అరెస్టు

● మరొకరు పరార్

చోడవరం రూరల్: ఒడిశా రాష్ట్రం దగురుబిల్లి గ్రామంలో కొనుగోలు చేసి చోడవరం మీదుగా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్న 22 కేజీల గంజాయితో చోడవరం పోలీసులు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. మరొకరు పరారయ్యాడు. కేసు దర్యాప్తు చేస్తున్న చోడవరం సీఐ బి.శ్రీనివాసరావు తెలిపిన వివరాలివి. శనివారం అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడు గుల మండలం కిల్లంకోట పంచాయతీ గొడ్డలికర్ర గ్రామానికి చెందిన వంతల దొరబాబు, తమిళనాడు రాష్ట్రం అరక్కోణం జిల్లా సోలంగీర్ గ్రామానికి చెందిన షణ్ముగం అజయ్‌కుమార్ అలియాస్ గోపాల్, కిశోరీ అనువారు చోడవరం ఆర్టీసీ కాంప్లెక్సు వద్ద 22 కేజీల గంజాయితో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా చోడవరం ఎస్ఐ తమ సిబ్బందితో తనిఖీ నిర్వహించారు. వారి వద్ద గంజాయి పట్టుబడడంతో షణ్ముగం అజయ్‌కుమార్, వంతల దొరబాబులను అదుపులోకి తీసుకోగా కిషోరీ అనే వ్యక్తి పరారయ్యాడన్నారు. పట్టుబడ్డ ఇద్దరిని అరెస్టు చేసి, గంజాయి స్వాధీనం చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పీఊ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


మత్స్యపురంలో గిరిజనులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ


జి.మాడుగులలో ధ్రువపత్రాలను అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

హుకుంపేట: పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు పారదర్శకంగా ప్రభుత్వం ప్రతి గడపకు సంక్షేమ పథకాలను అందజేయాలనే సదుద్దేశ్యంతో ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చెప్పారు. మండలంలోని మత్స్యపురం, ఓల్డా సచివాలయ కేంద్రాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా మత్స్యపురంలో 470 మందికి, ఓల్డాలో 912 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతీ ఒక్కరికీ పథకాలు చేరవయ్యే లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రభుత్వం అమల్లోకి తీసుకొందస్తున్నారు. ఈ కార్యక్రమంలో ద్వారా ప్రజా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని, అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జెడ్పీటీసీ సభ్యుడు రేగం మత్స్యలింగం, ఎంపీడీవో వెంకటరావు, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఈవోపీఆర్డీ అశోక్, డీటీ రంగారావు, సర్పంచ్‌లు పూజరి మేరి, పాంగి సింహాచలం, లక్ష్మయ్య, ఎంపీటీసీ సభ్యులు మీనా, వెంకట్, సుబ్బారావు, సాంబ, నాయకులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ సుపరిపాలన

జి.మాడుగుల: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సుపరిపాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి అన్నారు. మండలంలోని సింగర్బ, జి.మాడుగుల-1 సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న వారు మాట్లాడుతూ గత టీడీపీ పాలనలో ప్రభుత్వ పనుల కోసం కార్యాలయాలు చుట్టూ చెప్పులు అరిగేలా తిరగడం, మధ్యవర్తులకు కొంత సొమ్ము చెల్లించుకుంటేనే పనులు జరిగేవని గుర్తు చేశారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదని, జగనన్న ప్రభుత్వం ప్రజల చెంతకే సేవలన్నీ ఉచితంగా అందుతున్నాయన్నారు. రాష్ట్రంలో అర్హులైన ఉండి, ఇంకా లబ్ధి చేకూరని వారికి కూడా సంక్షేమ పథకాలు అందించాలనే ఉద్దేశ్యంతోనే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహించి, ఉచితంగా 11రకాల సేవలతో ధ్రువపత్రాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా జి.మాడుగుల-1 సచివాలయం పరిధిలో 1676 మందికి, సింగర్బ సచివాలయం పరిధిలో 406 మందికి వివిధ రకాల ధ్రువపత్రాలను వారు అందజేశారు. మొబైల్ ఆధార్ కేంద్రాన్ని, వైద్య శిబిరాన్ని వారు పరిశీలించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీపీఆర్వో గోవిందరాజులు, ఎంపీడీవో చంద్రశేఖరరావు, తహసీల్దార్ కె.అప్పలస్వామి, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకటగంగరాజు, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, సీడీపీవో సువర్ణమ్మ, ఏపీఎం సుందరమ్మ, డీటీ మోహనరావు, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, ఎం.కొండమ్మ, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, లక్ష్మి, మండల పార్టీ అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, జగనన్న సురక్ష మండల ఇన్‌చార్జి ఎల్ కళ్యాణం, సచివాలయ కన్వీనర్ రామకృష్ణ, నాయకులు చిట్టిబాబు, గంగరాజు, మత్స్యం నాయుడు, మత్స్యరాస వెంకటగంగరాజు, సింహాచలం, గ్రామ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు రుణపడి ఉంటా



జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమంతో సత్వరమే సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఈ కార్యక్రమంలో దరఖాస్తు చేసుకున్న నాకు నాలుగు రోజుల్లో ఆరోగ్య శ్రీ కార్డు మంజూరైంది. చాలా ఆనందంగా ఉంది. జగనన్న సేవలకు రుణపడి ఉంటాను.

– **పాంగి గీత**, ఉప్ప గ్రామం, మత్స్యపురం పంచాయతీ. హుకుంపేట మండలం

పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


పౌష్టికాహారం కిట్‌లను అందజేస్తున్న ట్రైకార్ చైర్మన్ బుల్లిబాబు, జెడ్పీటీసీ డాక్టర్ వెంకటలక్ష్మి

జి.మాడుగుల: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు, పిల్లలు సద్వినియోగం చేసుకోవాలని ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జెడ్పీటీసీ సభ్యురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని వారు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రం ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ఇతర సేవలపై గర్భిణులు, బాలింతలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని సక్రమంగా లబ్ధిదారులకు అందజేయాలని సిబ్బందికి ఆదేశించారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి, డీపీఆర్వో గోవిందరాజులు, ఎంపీడీవో చంద్రశేఖర్‌రావు, ఐసీడీఎస్ సీడీపీవో సువర్ణమ్మ, సర్పంచ్‌లు కిముడు రాంబాబు, సీదరి కొండబాబు, వైస్ ఎంపీపీ కె.సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర, మండల పార్టీ అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండం నాయుడు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి కళ్యాణం, నాయకుడు వెంకటగంగరాజు పాల్గొన్నారు.

108లో ప్రసవం


శిశువును అందజేస్తున్న సిబ్బంది

గూడెంకొత్తవీధి: 108 అంబులెన్సులో సుఖ ప్రసవం జరిగి తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్న సంఘటన గూడెంకొత్తవీధి మండలంలో శనివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే మండలంలో వంచుల పంచాయతీ తీములగుంట గ్రామానికి చెందిన గర్భిణి గుంట గురుబాని శనివారం మధ్యాహ్నం పురిటినొప్పులతో ఇబ్బంది పడుతుండగా భర్త గుంట సోన్ను 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకొని గర్భిణిని చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో నొప్పులు అధికమవడంతో కడుగుల గ్రామ సమీపంలో ఈఎంటీ హరి సుఖ ప్రసవం చేశారు. అనంతరం చింతపల్లి ఆస్పత్రికి తరలించారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండడంతో గురుబాని ఆనందం వ్యక్తం చేసి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. పైలెట్ దావిద్, ఆశా కార్యకర్త నిర్మల కుమారి ఉన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

సెర్ప్ సీఈవో ఇంతియాజ్


బవులవాడ చిరు ఉత్పత్తులను పరిశీలిస్తున్న సెర్ప్ సీఈవో ఇంతియాజ్

అనకాపల్లి రూరల్: మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహాలు కల్పిస్తున్నట్టు సెర్ప్ సీఈవో ఇంతియాజ్ చెప్పారు. పట్టణంలోని కేఎస్ఆర్ పేట, బవులువాడ గ్రామంలో జరిగిన కార్యక్రమాల్లో శనివారం రాత్రి ఆయన పాల్గొన్నారు. పీఎంఎఫ్ఎంఈ పథకం ద్వారా నెలకొల్పిన చిరుధాన్యాలు, బెల్లం యూనిట్లను పరిశీలించారు. స్త్రీనిధి ఉన్నతి ద్వారా పలువురు మహిళలు ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి యూనిట్లను పరిశీలించిన ఆయన మహిళా లబ్ధిదారుల అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు అవసరమైన మార్కెటింగ్ మెలకువలను నేర్పుతామని చెప్పారు. ఆధునిక అభిరుచులకు అనుగుణంగా వారి ఉత్పత్తులకు డిజైనింగ్, ప్యాకింగ్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. మహిళా సాధికారతకు అన్ని రకాలుగా ప్రభుత్వ సహాయం అందజేస్తామన్నారు. గ్రీన్ మిలీనియం అనకాపల్లి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాల సభ్యులకు మొక్కలు పంపిణీ చేశారు. కొందరు మహిళలకు పెరటికోళ్లను అందజేశారు.

యలమంచిలిలో జాబ్‌మేళా రేపు

యలమంచిలి: స్థానిక గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 17న జాబ్ మేళా నిర్వహించనున్నట్టు ఆ కళాశాల ప్రిన్సిపాల్ పి.చంద్రశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. అచ్యుతాపురం సెజ్‌లో ఉన్న వసుధ ఫార్మా కంపెనీ యాజమాన్యం పరవాడ, అచ్యుతాపురాల్లో ఉన్న తమ కంపెనీ యూనిట్లలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. బీఎస్సీ(కెమిస్ట్రీ), ఎమ్మెస్సీ(కెమిస్ట్రీ) విద్యార్హతగల అభ్యర్థులకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఎంపికైన బీఎస్సీ అభ్యర్థులకు సంవత్సరానికి రూ.2.12లక్షలు, ఎమ్మెస్సీ అభ్యర్థులకు రూ.2.48 లక్షల వేతనం, ఉచిత భోజనం, వసతి, ప్రయాణ సౌకర్యాన్ని కంపెనీ కల్పిస్తుందని తెలిపారు. మరిన్ని వివరాలకు కళాశాల ఫిజిక్స్ లెక్చరర్,జేకేసీ కోఆర్డినేటర్ కె.వెంకన్న (ఫోన్ నంబర్9542135995)ను సంప్రదించాలని తెలిపారు.